క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం



హన్మకొండ (పరకాల) : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన స్నేహితుడి కుటుంబాన్ని అతని చిన్ననాటి స్నేహితులు అండగా నిలిచారు. పరకాల పట్టణానికి చెందిన నేరేళ్ల విజయ్‌కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఆయన కుటుంబాన్ని పరామర్శించిన విజయ్‌కుమార్ చిన్ననాటి స్నేహితులు.. రూ.33వేల 500 ఆర్థికసాయం అందించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ: హనుమకొండ టౌన్ డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఈనెల 19న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కాజీపేట, సోమిడి, విష్ణుపురి, రహమత్‌నగర్, వెంకటాద్రినగర్ ప్రాంతాల్లో ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు, దర్గా, బియాబానీ నగర్, గాంధీనగర్, హౌసింగ్‌బోర్డు కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

హసన్‌పర్తి: చింతగట్టు స్టేషన్ పరిధిలోని భీమారం ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు టై, బెల్టుల పంపిణీ

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కుమ్మరిగూడెంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తరాలపల్లి గ్రామానికి చెందిన దాసరి కార్తీక్‌యాదవ్ టై, బెల్టులను పంపిణీ చేశారు. పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్, గ్రామ మాజీ సర్పంచ్ నల్లమారి రమేష్ చొరవతో టై, బెల్టులను అందజేసినట్లు కార్తీక్‌యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సీహెచ్.రవీందర్, పేరెంట్స్ కమిటీ సభ్యులు కాల్వచర్ల నవత, కొలిపాక మంగ, మాతంగి అవంతిక, నార్లగిరి కల్పన తదితరులు పాల్గొన్నారు.

నేషనల్ పవర్ లిఫ్టింగ్‌కు జిల్లా క్రీడాకారులు

హసన్‌పర్తి: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలకు వరంగల్ జిల్లా భీమారంలోని కమల్ పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు ఎంపికయ్యారని తెలంగాణ రాష్ట్ర పవర్ లిఫ్టింగ్ సెక్రటరీ జోసఫ్ తెలిపారు. ఈనెల 21నుంచి 28వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులు పాల్గొనున్నట్లు వివరించారు.

శాకంబరీ అలంకరణలో అమ్మవారు

హసన్‌పర్తి: గోపాలపురం బృందావన్ కాలనీలోని అభయాంజనేయస్వామి ఆలయంలో ఆషాఢ శుద్ధ త్రయోదశి నుంచి గురు పౌర్ణమి వరకు శాకంబరీ దేవి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు కార్యక్రమాన్ని పురస్కరించుకుని అమ్మవారిని శాకంబరీ రూపంలో గురువారం అలంకరించారు. నల్లాల విజయారెడ్డి – రాజిరెడ్డి, సాంబలక్ష్మి– డాక్టర్ సారయ్య దంపతులు పలు రకాల కూరగాయలు, ఫలాలు, పుష్పాలతో అమ్మవారిని అలంకరించారు. వివిధ కాలనీ నుంచి భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీవిజయానిత్య అలంకరణలో

హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న శ్రీరాజరాజేశ్వరీదేవి దేవాలయంలో నిర్వహిస్తున్న శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని శనివారం శాకంబరీదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆషాఢ శుద్ధ ద్వాదశి గురువారం అమ్మవారిని శ్రీవిజయానిత్యగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ అర్చకుడు లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఉదయం నుంచి అర్చనలు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. అనంతరం మహాహారతి ఇచ్చి భోజన ప్రసాదాల వితరణ చేశారు. ఈ సందర్భంగా అర్చకుడు లక్ష్మణశర్మ మాట్లాడుతూ శనివారం వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరిస్తామని, సాయంత్రం పౌర్ణమిపూజ, భక్తులకు భోజనప్రసాదాల వితరణ ఉంటుందని తెలిపారు.

కార్యవర్గం రాజీనామా

ఖిలా వరంగల్: ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యవర్గం గురువారం రాజీనామా చేసినట్లు అధ్యక్ష, కార్యదర్శులు మహ్మద్ ఫిరోజ్ అలీ, షేక్ అజ్మత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ –నర్సంపేట రోడ్డులోని ఓరుగల్లు లారీ ఓనర్స్ అసోసియేషన్ పార్కింగ్ స్థలంలో గురువారం జరిగిన కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశారు. త్వరలో ఎన్నికలు ఉంటాయని తెలిపారు.

ప్రమాదకరంగా యూటర్న్‌లు..

- హైవే ఎక్కాలంటే జంకుతున్న ప్రయాణికులు
- ఏపుగా పెరిగిన చెట్లు
- ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించవు..



మండల కేంద్రంలో ప్రమాదకరంగా ఉన్న యూటర్న్ పాయింట్

ఆత్మకూరు : మండల కేంద్రం పరిధిలోని 163 హైవే నిత్యం రద్దీగా ఉంటుంది. రోడ్డు నిర్మాణ సమయంలో ఏర్పాటు చేసిన యూటర్న్‌లు ప్రామాణికత పాటించకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. అలాగే డివైడర్‌లపై నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదని వాహనదారులు అంటున్నారు. రోడ్డు దాటేందుకు ఇష్టానుసారంగా మార్గాలు ఏర్పాటు చేశారని వాపోతున్నారు. దీంతో రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని భయాందోళన చెందుతున్నారు. ఇటీవల అనేక ప్రమాదాలు చోటుచేసుకోగా పలువురు గాయపడినట్లు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హైవే ఎక్కాలంటే భయపడాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. పాలకులు, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సరైన పద్ధతిలో యూటర్న్‌లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు

హన్మకొండ(పరకాల) / శాయంపేట : గుడుంబా విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని పరకాల ఎక్సైజ్ శాఖ సీఐ తాతాజీ హెచ్చరించారు. పరకాల స్టేషన్ పరిధిలో మూడు చోట్ల తనిఖీలు నిర్వహిస్తుండగా 60 లీటర్ల గుడుంబా పట్టుబడినట్లు ఆయన పేర్కొన్నారు. శాయంపేట మండలంలోని సూర్యానాయక్ తండాకు చెందిన జరుపుల లింగానాయక్ వసంతాపూర్‌కు స్కూటీపై 20లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకున్నట్లు తాతాజీ తెలిపారు. అలాగే సంగెం మండలం పల్లార్‌గూడ నుంచి గీసుగొండ మండలం ఊకల్‌కు హీరో హోండా స్ప్లెండర్‌పై గుగులోతు సమ్మయ్య, గుగులోతు ధర్మ 10లీటర్ల గుడుంబా తరలిస్తుండగా పట్టుకుని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు తెలిపారు. బైకు స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్సై జ్యోతి, సిబ్బంది లక్ష్మణచారి, దిలీప్, అఖిల్, శ్రీనివాస్ తో పాటు తదితరులు ఉన్నారు.



శాయంపేట : గుండుబాను స్వాధీనం చేసుకుంటున్న ఎక్సైజ్ పోలీసులు

రైతువేదికలో ఖాళీ కుర్చీలు



శాయంపేట : లక్షలోపు పంట రుణాలను రాష్ట్ర ప్రభుత్వం మాఫీ చేస్తున్న సందర్భంగా మండల కేంద్రాల్లోని రైతువేదికల్లో సంబురాలు చేసుకుని, సీఎం ప్రసంగాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించాలని ప్రభుత్వం రైతులను కోరింది. అయితే మండలంలోని పెద్దకోడెపాక రైతువేదికలో ప్రత్యక్షమయ్యే సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించేందుకు కొద్దిమంది రైతులు మాత్రమే హాజరు కాగా ఇలా ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి.

మున్సిపల్ ఉద్యోగుల బదిలీలు నిలిపేయాలి

హన్మకొండ అర్బన్: జీడబ్ల్యూఎంసీలో పనిచేస్తున్న సఫాయి కార్మికులు, జవాన్లు, అటెండర్లు, ఉద్యోగులకు ప్రభుత్వం తలపెట్టిన ఇతర జిల్లాల బదిలీల నుంచి వారిని ఉపసంహరించాలని తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, గౌరవ అధ్యక్షుడు ఏల్పుల ధర్మరాజు, తెలంగాణ మున్సిపాలిటీ ఉద్యోగ అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐయూటీసీ) వేల్పుల సారంగపాణి డిమాండ్ చేశారు. ఈ మేరకు హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, కార్మికులను మరో జిల్లాకు బదిలీ చేయాలని తీసుకున్న నిర్ణయంతో కార్మికులకు అనేక ఇబ్బందులకు గురయ్యే పరిస్థితి ఉందని, వెంటనే ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం అధ్యక్షుడు మున్నంగి రఘు, బాబు, మద్దె శ్రీనివాస్, ఎ.మూర్తి రాజు, ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఐనవోలులో 2,130 మంది రైతులకు రుణమాఫీ

ఐనవోలు : మండల వ్యాప్తంగా 5 వ్యవసాయ క్లస్టర్లు, 10 రెవెన్యూ గ్రామాలు, 17 గ్రామాల్లోని లక్షలోపు పంట రుణాలు తీసుకున్న 2,130 మంది రైతులకు తొలివిడుతలో ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి అడప కవిత తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. మండల వ్యాప్తంగా పట్టాదారు పాసుబుక్కులు కలిగిన రైతులు 13,983 మంది ఉన్నారన్నారు. గర్మిళ్లపల్లిలో 267, ఐనవోలులో 239, కక్కిరాలపల్లి 190, కొండపర్తి 418, నందనం 321, పంథిని 32, పున్నేలు 157, సింగారం 89, వనమాల కనపర్తి 167, వెంకటాపూర్ 250 మంది రైతులు తొలి విడుతలో లక్ష లోపు రుణం పొందిన రైతులు ఉన్నట్లు తెలిపారు. కాగా మండల వ్యాప్తంగా 2,130 మంది ఉండగా వారికి పూర్తిగా రుణమాఫీ అవనున్నట్లు వెల్లడించారు. కాగా మండల వ్యాప్తంగా ఎంతమంది రైతులు వివిధ బ్యాంకుల ద్వారా ఎంత రుణాలు పొందారన్న వివరాలు మాత్రం వెల్లడించలేదు.

‘108 ఉద్యోగుల’ వేతనం పెంచాలి



వినతిపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

హన్మకొండ అర్బన్: రాష్ట్రంలో 108 అత్యవసర సర్వీసు ఉద్యోగులకు ప్రభుత్వం ఇప్పుడు చెల్లిస్తున్న దాని కంటే 40శాతం వేతనాలను పెంచి ఇవ్వాలని, ప్రభుత్వ రెగ్యులర్, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని రాష్ట్ర 108 ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు లకావత్ బాలాజీనాయక్, దేవేందర్‌రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డైరెక్టర్ ఆర్‌వి.కర్ణన్‌ను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 108 ఉద్యోగులు రోజుకు 12 గంటలు పనిచేస్తున్నా శ్రమకు తగిన వేతనం అందడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రమను గుర్తించి 40 శాతం మేర వేతనాలు పెంచేందుకు బడ్జెట్‌లో కేటాయించేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని కోరారు.

నేటి ధర్నాకు తరలిరావాలి

శాయంపేట : ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకొని నివసిస్తున్న గుడిసెవాసులకు పట్టాలు పంపిణీ చేసి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఐ మండల సహాయ కార్యదర్శి అనుకారి అశోక్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం తలపెట్టిన తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ధర్నాలో అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

నిరంతర గానంతో రికార్డుకు యత్నం

నయీంనగర్: కాకతీయ మ్యూజికల్ క్లబ్ సభ్యురాలు సింగర్ సనశ్రీ తన గాత్రం ద్వారా తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డ్స్, ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడానికి 108 మల్టీ లాంగ్వేజెస్ పాటలను సాహిత్యాన్ని చూడకుండా నాన్ స్టాప్‌గా 8గంటల వ్యవధిలో పాడి రికార్డ్ నెలకొల్పనుందని, ఆ వీడియో ప్రతిని గిన్నీస్ వరల్డ్ రికార్డ్ కోసం పంపనున్నట్లు ఎండీ.సి రాజుద్దీన్ తెలిపారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమం నయీంనగర్ వాగ్దేవి కళాశాల ఆడిటోరియంలో జూలై 21న ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత ప్రియులు పాల్గొనాలని కోరారు. సమావేశంలో సింగర్ సనశ్రీ, తోట పూర్ణచందర్ రావు, ఎండీ.సి రాజుద్దీన్, రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిరాజుద్దీన్

ఉద్యమకారులను ఆదుకోవాలి

ఖిలా వరంగల్: తెలంగాణ ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కళాకారుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు గడ్డం సుధాకర్, రాజేశ్వర్‌రావు, అనుమోజు వెంకన్న కోరారు. వరంగల్ రైల్వేగేట్ శాంతినగర్‌లోని రాజశ్రీగార్డెన్‌లో తెలంగాణ నిరుద్యోగ కళాకారుల ఉమ్మడి జిల్లా సదస్సు గురువారం జరిగింది. పాలేటి రాజు, సిల్వేరు శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ రాష్ట్ర సాధన కోసం ఆటపాటలతో ప్రజలను చైతన్యవంతులను చేసిన వారు 550 మంది కాదని, వేలాది మంది ఉన్నారని తెలిపారు. వారందరికి అవకాశం కల్పించాలని సూచించారు. తాము కళాకారులకు అండగా ఉంటామని, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఎన్నికల హామీని అమలు చేయాలని కోరారు. సమావేశంలో తండ సదానందం, లింగన్న, లింగమూర్తి, బిర్రు సురేందర్, రమేష్, చంద్ర, అంకూస్, రాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న గడ్డం సుధాకర్

‘సుజాత కవనాల’ ఆవిష్కరణ

హన్మకొండ అర్బన్: తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, గీతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కవయిత్రి సుజాత రచించిన ‘సుజాత కవనాల’ పుస్తకాన్ని సినీ గేయ రచయిత సాదనాల వెంకటస్వామి నాయుడు, ప్రముఖ రచయిత్రి కరాదుల అరుణ కీర్తి పతాకారెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రచయిత్రి సుజాత పుస్తకంలో చాలా కవితలు స్త్రీల సమస్యలను ప్రస్తావిస్తూ పరిష్కారం చూపినట్లు తెలిపారు. స్త్రీ సాధికారతకు ఈ పుస్తకం ఎంతో దోహదపడుతుందని హర్షం వ్యక్తం చేశారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటస్వామి నాయుడు, కీర్తి పతాకారెడ్డి

సేవా కార్యక్రమాలు అభినందనీయం

కమలాపూర్ : ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఒడితల ప్రణవ్ అన్నారు. కమలాపూర్‌లోని శ్మశానవాటికలో ఇటీవల శిథిలమై కూలిపోయిన మినీ వాటర్ ట్యాంక్ స్థానంలో ఎర్రగోళ్ల అశోక్ స్మారకార్థం గణేశ్ భక్త మండలి ఆధ్వర్యంలో రూ.28 వేల వ్యయంతో పునర్నిర్మించిన మినీ వాటర్‌ట్యాంకును గురువారం ఆయన ప్రారంభించారు. స్నేహితుని జ్ఞాపకార్థం నిత్యం ప్రజలకు ఉపయోగపడే విధంగా స్నేహితులంతా కలిసి మినీ వాటర్‌ట్యాంకు నిర్మించడం గొప్ప విషయమన్నారు. గణేశ్ భక్త మండలి సభ్యులు వైనాల సుభాష్, ఆడెపు శ్రీకాంత్, కొలిపాక నాగరాజు, జక్కు రాజు, పచ్చిమట్ల భిక్షపతి, సతీష్, కుమారస్వామి, చిట్టోజి వెంకటేశ్, రాజ్‌కుమార్, పవన్, శ్రీను, గొట్టె రాజశేఖర్, పబ్బు శ్రీనివాస్, కుమారస్వామి, సాయి, శివశంకర్ పాల్గొన్నారు.



మినీ వాటర్‌ట్యాంక్ ప్రారంభిస్తున్న ప్రణవ్

పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టాలి



కాల్వను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గుండె బాబు

కమలాపూర్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులను సక్రమంగా చేపట్టాలని ఎంపీడీఓ గుండె బాబు పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని శ్రీరాములపల్లి, గూనిపర్తి, మాదన్నపేట గ్రామాల్లో గురువారం ఆయన పారిశుద్ధ్యం, వన మహోత్సవం, మంచినీటి సరఫరా, అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు–మన బడి పనులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీల్లోని రిజిష్టర్లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామాల్లోని డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ బయోటిక్స్ స్ప్రే చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాలలు, మన ఊరు–మన బడిలో అనుమతి పొందిన పనులన్నీ పూర్తి చేసి రికార్డులను సకాలంలో అందించాలన్నారు. వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా తగిన మోతాదులో బ్లీచింగ్ పౌడర్ కలిపిన మంచినీటిని సరఫరా చేయాలని ఆదేశించారు. వాటర్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలన్నారు. వన మహోత్సవంలో భాగంగా ప్రతి గ్రామంలో 2 వేల నుంచి 5 వేల మొక్కలు నాటాలని, ప్రతి గ్రామంలో కనీసం ఐదుగురు రైతులు పండ్ల తోటలు సాగు చేసేలా ప్రోత్సహించాలన్నారు. దోమల నివారణకు వారానికోసారి ఫాగింగ్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో ఈజీఎస్ ఏపీఓ రమేశ్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇంటి స్థలాలివ్వాలి

- సీపీఐ జిల్లా కార్యదర్శి భిక్షపతి

కమలాపూర్ : అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇళ్లు, ఇంటి స్థలాలు లేని నిరుపేదలతో కలిసి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు ఇళ్లు, ఇంటి స్థలాలివ్వాలని సీపీఐ ఆధ్వర్యంలో అనేక సార్లు భూ పోరాటాలు చేశామని తెలిపారు. అప్పటి ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యతో దాటవేశాయని ఆరోపించారు. అప్పటి ప్రభుత్వం పట్టాలు ఇచ్చింది కానీ స్థలాలను చూపించలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో కమలాపూర్‌లో 347, గూడూరులో 140, మర్రిపల్లిగూడెంలో 76 చొప్పున మొత్తం 563 డబుల్‌బెడ్రూంలు నిర్మించారని, వాటిని ఇప్పటి వరకు నిరుపేదలకు పంపిణీ చేయలేదని మండిపడ్డారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన నిరుపేదలకు వెంటనే డబుల్ బెడ్రూంలు కేటాయించాలని కోరారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ శోభారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి నకీర్త ఓదెలు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆదరి శ్రీనివాస్, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కు రాజుగౌడ్, నాయకులు ధర్ముల రాంమూర్తి, బాలరాజ్, శంకర్, లచ్చన్న, లక్ష్మి, శిరీషతో పాటు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

అధిక విషప్రభావం కలిగిన మందులు వాడొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న మానస

శాయంపేట : అధిక విషప్రభావం కలిగిన పురుగు మందులను రైతులు పొలాల్లో వాడొద్దని ప్రజ్వల్ ఎఫ్‌సీఎల్ పీయూ మేనేజర్ గుడిమల్ల మానస అన్నారు. గురువారం మండల కేంద్రంలో పురుగులమందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మందు డబ్బాలపై ఎర్ర రంగు గుర్తులు కలిగి ఉంటే ఆ మందు అత్యంత ప్రమాదకరమని, వాటిని వ్యవసాయ క్షేత్రాల్లో ఉపయోగించొద్దని సూచించారు. రైతులు పురుగుమందులు పిచికారి చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఏఓ గంగామున, ఏఈఓలు రజా, అర్చన, ప్రజ్వల్ ప్రతినిధులు రాంబాబు, కల్పన పాల్గొన్నారు.

అంబరాన్నంటిన రుణమాఫీ సంబురాలు

రైతు రుణమాఫీ సంబురాలు జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానం నెరవేర్చిందని కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌ను తిలకించేందుకు వ్యవయశాఖ అధికారులు ఆయా మండల కేంద్రాల్లోని రైతు వేదికల్లో ఏర్పాట్లు చేయగా రైతులు హాజరై సీఎం సందేశాన్ని తిలకించారు. శాయంపేటలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు పాల్గొనగా.. ఆత్మకూరులో కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి పాల్గొని రైతులతో మాట్లాడారు. ఆయా మండల కేంద్రాల్లో రైతులు సీఎం రేవంత్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రవాణశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్, ఎమ్మెల్యేల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.



శాయంపేట : సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు



ఆత్మకూరు : రైతులతో మాట్లాడుతున్న కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి



హన్మకొండ (పరకాల) : పరకాల పట్టణంలో కాంగ్రెస్ నాయకుల బైక్ ర్యాలీ..



కమలాపూర్ : సీఎం, మంత్రుల చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

దళిత, గిరిజనులపై అసెంబ్లీలో చర్చించాలి



హన్మకొండ: దళిత, గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి, రక్షణపై అసెంబ్లీలో చర్చించాలని, అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని అమలు చేసి ఎన్నికల హామీని నిలబెట్టుకోవాలని దళిత బహుజన ఫ్రంట్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ ఒక ప్రకటనలో కోరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్‌ను అమలు చేస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన దళితబంధు పథకం స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం పథకాన్ని రూ.12 లక్షలకు పెంచి అమలు చేస్తామని చెప్పారని కానీ అమలు చేయడం లేదని పేర్కొన్నారు. ఎస్సీ రిజర్వేషన్‌ను 18 శాతం పెంచుతామని, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌ను విభజించి ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక కమిషన్‌ను ఏర్పాటు చేస్తామనే హామీని నిలబెట్టుకోవాలని సూచించారు.